సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం : 28 : జనవరి : 2023



టన్ను చీనీ రూ.30 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.30 వేలు పలికాయి. మార్కెట్‌కు 24 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.20

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.20, కనిష్టం రూ.6, సరాసరి ధర రూ.12 ప్రకారం పలికింది.

గరిష్టం/కనిష్టం
31.6°/10.5°

జిల్లా అంతటా శుక్రవారం చలి స్వల్పంగా పెరిగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు కాస్త తగ్గాయి. గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

నేడు జిల్లాకు వన్‌మ్యాన్ కమిషన్

పుట్టపర్తి టౌన్: బెంట ఒరియా, బోయ, వాల్మీకి కుల జీవన స్థితిగతుల అధ్యయనానికి నియమించిన విశ్రాంత ఐఏఎస్ శామ్యూల్ ఆనంద్‌కుమార్ నేతృత్వంలోని వన్‌మ్యాన్ కమిషన్ శనివారం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ బసంత్‌కుమార్ తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కమిషన్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. బెంట ఒరియా, వాల్మీకి కుల సంఘాల ప్రజాప్రతినిధులు, నాయకుల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. ఆయా కులాలకు సంబంధించిన నాయకులు, సంఘాల ప్రజాప్రతినిధులు వారి సమస్యలపై కమిషన్‌కు వినతి పత్రాలు సమర్పించుకోవచ్చన్నారు.

కలెక్టర్ మనవడికి పీహెచ్‌సీలో వైద్యం!



కలెక్టర్ మనవడిని పరీక్షిస్తున్న వైద్యుడు

పుట్టపర్తి టౌన్: ఆయనో కలెక్టర్...అనుకుంటే కుటుంబీకులకు కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించగలరు. కానీ జ్వరంతో బాధపడుతున్న తన మనవడు (కుమార్తె కుమారుడు)ని ఓ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి వైద్యం చేయించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందే వైద్యం, సౌకర్యాలపై ప్రజలకు నమ్మకం కలిగించేందుకు ఇలా వ్యవహరించారు. వివరాల్లోకి వెళితే...కలెక్టర్ బసంత్‌కుమార్ మనవడు కిరీటి విరాజ్ వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నాడు. శుక్రవారం సాయంత్రానికి జ్వరం పెరగడంతో కలెక్టర్ తన మనవడిని పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లారు. విషయం తెలుసుకుని అక్కడకు వచ్చిన డీసీహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్, డాక్టర్ నాగరాజు నాయక్ చిన్నారిని పరీక్షించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈ క్రమంలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించి అవసరమైన మందులు అందుబాటులో ఉంచిందన్నారు. అందువల్లే తానూ తన మనవడిని పీహెచ్‌సీకి తీసుకువచ్చానని, వైద్యుల సేవలు కూడా బాగున్నాయంటూ కితాబు ఇచ్చారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం



చిలమత్తూరు స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ రాహుల్ దేవ్‌సింగ్

చిలమత్తూరు: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులను పరిశీలించారు. అనంతరం స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, దర్యాప్తు తీరును ఎస్ఐ శ్రీనివాసులును అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. సరిహద్దులో నిరంతర నిఘా ఉంచాలని, ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. మద్యం, గుట్కా అక్రమ రవాణాను కట్టడి చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.



మడకశిర సమీపంలో సాగులో ఉన్న మల్బరీ తోట



హిందూపురం మార్కెట్‌లో అమ్మకానికి ఉంచిన పట్టుగూళ్లు

మనమే టాప్

- మల్బరీ, పట్టులో 'ఉమ్మడి అనంత' పైచేయి
- రాష్ట్రంలోనే అత్యధికంగా మల్బరీ సాగు శ్రీసత్యసాయి జిల్లాలోనే..
- మల్బరీ సాగులో అనంతపురం జిల్లా నాలుగో స్థానం
- నాణ్యమైన పట్టుగూళ్లకు పేరుగాంచిన పురం మార్కెట్

ఉద్యాన పంటలకు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు రాష్ట్రంలోనే పేరెన్నికగన్నవి. కానీ ఈ రెండు ఇప్పుడు మల్బరీ సాగులోనూ మొదటి వరుసలో నిలిచాయి. శ్రీసత్యసాయి జిల్లాలో ఉత్పత్తయ్యే పట్టు అత్యంత నాణ్యమైనది. ఇక్కడ ఉత్పత్తి అయ్యే పట్టుకు దేశీయంగా మంచి మార్కెట్ ఉంది. రాష్ట్రంలో అత్యధిక విస్తీర్ణంలో మల్బరీ పండించే జిల్లాల్లో శ్రీసత్యసాయి మొదటి స్థానంలో ఉండగా.. అనంతపురం జిల్లా నాలుగో స్థానంలో ఉంది. అంతర్జాతీయంగానూ ధర్మవరంలో తయారయ్యే పట్టుచీరలకు ఎంత ఖ్యాతి ఉందో అందరికీ తెలిసిందే.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: మనరాష్ట్రంలో శ్రీసత్యసాయి జిల్లాలోని మడకశిర, హిందూపురం, పుట్టపర్తి, ధర్మవరం ప్రాంతాలతో పాటు అనంతపురం జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో మల్బరీ సాగు భారీ విస్తీర్ణంలో ఉంది. ఒక్క శ్రీసత్యసాయి జిల్లాలో 26వేల మంది రైతులు 44,487 ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తున్నట్టు పట్టుపరిశ్రమ శాఖ అంచనా. చిత్తూరులో 39,849 ఎకరాల్లోనూ, అన్నమయ్య జిల్లాలో 12,839 ఎకరాల్లోనూ పండిస్తుండగా, 6,740 ఎకరాల్లో మల్బరీ సాగుచేస్తూ అనంతపురం జిల్లా నాల్గో స్థానంలో నిలిచింది. శ్రీసత్యసాయి జిల్లాలో 26వేల పైచిలుకు మల్బరీ రైతులుండగా, అనంతపురం జిల్లాలో 8,500 మంది ఉన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఉత్పత్తి అవుతున్న పట్టుగూళ్లు అత్యంత నాణ్యమైనవిగా పేరుంది. ప్రస్తుతం రాష్ట్రంలోనే అత్యధికంగా ధర్మవరం పట్టుగూళ్లు కిలో రూ.607 పలుకుతున్నాయి.



మల్బరీ సాగులో రాష్ట్రంలో టాప్ 6 జిల్లాలు

జిల్లా	మల్బరీ సాగు (ఎకరాల్లో)
శ్రీ సత్యసాయి	48,487
చిత్తూరు	39,849
అన్నమయ్య	12,839
అనంతపురం	6,740
ప్రకాశం	3,731
కాకినాడ	3,003

పట్టుగూళ్ల మార్కెట్‌లో ధరలు ఇలా...

ప్రాంతం	పట్టుగూళ్లు ధర (కిలో)
హిందూపురం	రూ.594
కదిరి	రూ.579
ధర్మవరం	రూ.607
పలమనేరు	రూ.592
మదనపల్లె	రూ.615
హనుమాన్ జంక్షన్	రూ.436
చేబ్రోలు (కాకినాడ)	రూ.470
కుప్పం	రూ.613

పట్టుగూళ్ల ధర ఆశాజనకం



రెండు ఎకరాల్లో మల్బరీ సాగు చేశాం. ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి పెట్టాం. బైవోల్టిన్ పట్టుగూళ్లు పెంచాం. దిగుబడి బాగా వచ్చింది. పట్టు గూళ్ల ధర కూడా ఆశాజనకంగా ఉంది. కిలో రూ.700పైగా పలికింది. రెండు ఎకరాలకు రూ.లక్షదాకా లాభం వచ్చింది.

– రంగనాథ్, రైతు, రొళ్ల

మల్బరీ సాగు లాభదాయకం



కొన్నేళ్లుగా పట్టు పరుగులు పెంచుతున్నా. రెండెకరాల్లో మల్బరీ సాగు చేశా. ఏటా ఐదు నుంచి ఆరు పంటలు తీసుకుంటా. ఒక పంటకు ఖర్చు పోను రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు ఆదాయం వస్తుంది. మల్బరీ నర్సరీని కూడా ఏర్పాటు చేశా. నర్సరీ ద్వారా కూడా ఆదాయం వస్తోంది.

– నారాయణప్ప, వి.అగ్రహారం, అమరాపురం

లక్ష్యానికి మించి మల్బరీ సాగు



హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్ రాష్ట్రంలోనే అతి పెద్దది. సగటున రోజుకు 6వేల కిలోల పట్టుగూళ్లు వస్తున్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో కదిరి, ధర్మవరంలో కూడా పట్టుగూళ్ల మార్కెట్లు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 25 వేల ఎకరాల్లో మల్బరీ సాగులో ఉంది. ఈ సారి లక్ష్యానికి మించి సాగులోకి వచ్చింది.

– పద్మమ్మ, పట్టు పరిశ్రమ శాఖ జేడీ, శ్రీసత్యసాయి జిల్లా

నేడు ఖాద్రీ ఆలయంలో రథసప్తమి వేడుకలు

కదిరి టౌన్: రథసప్తమి సందర్భంగా శనివారం ఖాద్రీ లక్ష్మీనరసింహ ఆలయంలో ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, చైర్మన్ గోపాలకృష్ణ తెలిపారు. ఉదయం 6 గంటలకు స్వామివారిని వివిధ పుష్పాలతో అలంకరిస్తామని, అనంతరం శ్రీవారు సూర్యప్రభ వాహనంపై తిరువీధుల్లో భక్తులకు దర్శనమిస్తారన్నారు.

మధ్యనవమి ఉత్సవం..

మాఘమాసం మధ్య నవమి సందర్భంగా 30వ తేదీ (సోమవారం) ఖాద్రీశుడు సాయంత్రం 5.30 గంటల నుంచి హనుమంత వాహనంపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనం ఇవ్వనున్నరు. శ్రీవారి బ్రహ్మోత్సవాలు సరిగ్గా నెల రోజుల తర్వాత ప్రారంభమవుతాయని తెలిపేందుకు ఏటా ఆనవాయిగీ ఈ ఉత్సవం నిర్వహిస్తున్నారు.

ప్రతినెలా జాబ్‌మేళా నిర్వహణకు చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి టౌన్: యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లాలో ప్రతినెలా జాబ్‌మేళా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ బసంత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం విజయవాడ నుంచి ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శిశు సంక్షేమం, ప్రభుత్వ పథకాలు, సిల్క్ డెవలప్‌మెంట్, సిల్క్‌హబ్, స్పందన గీవెన్స్, 'గడప గడపకూ మన ప్రభుత్వం'పై తదితర అంశాలపై చర్చించారు. కలెక్టర్ బసంత్‌కుమార్, డీఆర్‌ఓ కొండయ్య తదితరులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా యువతకు విరివిగా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని, కియా మోటార్స్, సిల్క్ డెవలప్‌మెంట్ శాఖ సమన్వయంతో 335 బ్యాచ్‌లలో 5,700 మంది యువతకు నైపుణ్య శిక్షణ ఇప్పించామన్నారు.శిశు సంక్షేమం, ప్రభుత్వ పథకాల్లో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు తగు చర్యలు తీసుకొంటున్నట్లు వెల్లడించారు.

మాటలొద్దు... ఏం చేశావో చెప్పు

- పేరంటాలకు తప్ప...నియోజకవర్గ ప్రజలకోసం ఎప్పుడైనా 'పురం' వచ్చావా?
- నమ్మి ఓట్లేసిన వారికి ముఖం చూపని నువ్వా ప్రజా సేవ గురించి చెప్పేది
- బాలకృష్ణపై ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ ఆగ్రహం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

హిందూపురం: ''మైకు కనిపిస్తే చాలు సినిమా డైలాగులే...ఈ ప్రభుత్వం అదీ చేయలేదు...ఇదీ చేయలేదు అంటున్నావు...రెండుసార్లు నిన్ను నమ్మి అసెంబ్లీకి పంపితే హిందూపురానికి నువ్వేం చేశావో చెప్పు బాలయ్యా...పెళ్లి, పేరంటాల కోసం తప్ప నియోజకవర్గ ప్రజలు ఎలా ఉన్నారని తెలుసుకునేందుకు ఒక్కసారైనా ఇక్కడికి వచ్చావా...కరోనా కష్ట కాలం 'పురం' కన్నెత్తి చూడని నువ్వు కూడా మాట్లాడితే ఎట్టా బాలయ్యా.. అసలు నీకు హిందూపురంలో ఎన్ని కాలనీలున్నాయి... అందులో ఉన్న గడవలెన్ని తెలుసా..చుట్టపుచూపుగా వచ్చే నువ్వు కూడా 'పురం' అభివృద్ధిపై మాట్లాడం హాస్యాస్పదం'' అని ఎమ్మెల్సీ ఇక్బాల్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. జగన్ సర్కార్ గురించి మాట్లాడుతున్న బాలకృష్ణ...క్షేత్ర స్థాయిలో పర్యటిస్తే పాలన ఎలా ఉందో తెలుస్తుందన్నారు. సినిమాలో డైలాగులు రాసినట్టు ఎవరో రాసిస్తే దాన్ని చదివడం నాయకుల లక్షణం కాదన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారన్నారు. 'గడప గడపకూ' తాము వెళ్తుంటే టీడీపీ కార్యకర్తలు కూడా తమకు పథకాలు అందాయని ఆనందంగా చెబుతున్నారని, తమది ప్రజా ప్రభుత్వమని చెప్పేందుకు ఇంతకంటే నిదర్శనం ఏంకావాలన్నారు.

మా నెత్తిన అప్పుల కుప్ప పెట్టావు..

మాటెత్తితే హిందూపురాన్ని అభివృద్ధి చేశానంటున్న బాలకృష్ణ..వాస్తవానికి 'పురం' నెత్తిన అప్పుల కుప్ప పెట్టారని ఎమ్మెల్సీ ఇక్బాల్ మండిపడ్డారు. అమృత్ స్కీం నిధులన్నీ దోచేసి పనులకోసం మున్సిపాలిటీ నెత్తిన రూ.వందకోట్లు అప్పుపెట్టారన్నారు. బాలకృష్ణ హయాంలో చేసిన అప్పులకు ఇప్పటికీ ప్రతినెలా రూ.63 లక్షలు వడ్డీ కడుతున్నామన్నారు. గత ఎన్నికల ముందు హిందూపురం వచ్చి హడావుడి చేసిన బాలకృష్ణ రూ.3 కోట్లు తెస్తానని మసీదును కూల గొట్టించి వదిలేశారని, మార్కెట్ అర్ధాంతరంగా ఆపేశారని, రోడ్ల పేరుతో ముద్దిరెడ్డిపల్లి, ఇతర గ్రామాల్లో గుంతలు తవ్వి వదిలేయగా తాము అధికారంలోకి వచ్చాక పూర్తి చేశామన్నారు. డంపింగ్ యార్డు నిర్మించడంతో పాటు హిందూపురం కాయగూరల మార్కెట్ కూడా జగన్ సర్కారే పూర్తిచేసిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. తన సినిమాలు విజ్ఞానం పంచుతున్నాయంటున్న బాలకృష్ణ...హీరోయిన్‌తో కలిసి వైన్ తాగడమే మీరు నేర్పే విజ్ఞానమా అని ప్రశ్నించారు. వయస్సు పెరిగితే పెద్దరికం రాదన్నారు. నేతలంటే డైలాగ్‌లు చెప్పడం కాదని...నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ వారి అవసరాలు, సమస్యలు తీర్చాలన్నారు. విగ్గుపెట్టుకుని, జట్టుకు రంగేస్తే 60 ఏళ్ల వయస్సు 20కి తగ్గిపోతుందా..? అని ప్రశ్నించారు.

ఆ మాత్రం సంస్కారం లేదా..

అక్కినేని నాగేశ్వరరావు.. రంగరావులను కించపరుస్తూ మాట్లాడిన బాలకృష్ణ...కనీసం దాన్ని ఒప్పుకునే సంస్కారం కూడా లేదన్నారు. పైపెచ్చు సమర్థించుకుంటూ బాబాయ్ లాంటివారని చెప్పడం తన కుసంస్కారానికి నిదర్శనమన్నారు. బాలయ్య అన్నట్లు జనం కూడా ఫ్లోలో బాలయ్య గీలయ్య..చంద్రన్న..గింద్రన్న, లోకేష్... గికేష్ అంటే బాగుంటుందా అని ప్రశ్నించారు.

పది ఫలితాల్లో ఫస్ట్ ప్లేస్‌లో నిలుద్దాం

- విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన సాగాలి
- హెచ్‌ఎంలు, ఎంఈఓలు, ఎస్‌ఓల సమీక్షలో ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి



ఎంఈఓలు,హెచ్‌ఎంల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి

పుట్టపర్తి: విద్యార్థులకు అర్థమయ్యేలా బోధిస్తూ పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి, డైట్ ప్రిన్సిపాల్ రామకృష్ణ తదితరులతో కలిసి బుక్కపట్నం డైట్ ఆర్టీటీ ఆడిటోరియంలో జిల్లాలో అన్ని మండలాల ఎంఈఓలు, అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, కేజీబీవీ, గురుకుల పాఠశాలల ఎస్‌ఓలతో 10వ తరగతి పరీక్షల సన్నద్ధతపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ... చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాఠశాలలో ఉత్తీర్ణత శాతం 100 శాతం వచ్చేలా ప్రతి హెచ్‌ఎం తగు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు మానసికంగా ఇబ్బంది పడకుండా శని, ఆదివారాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించవద్దని సూచించారు. అనంతరం వివిధ సబ్జెక్టుల బోధనలో షార్ట్ కట్స్‌తో పాటు పిల్లలకు అర్థమయ్యేలా బోధించే ప్రక్రియ గురించి ఆర్జేడీ వివరించారు.

విద్యారంగంపై సీఎం ప్రత్యేక శ్రద్ధ..

విద్యారంగంపై సీఎం జగన్ ప్రత్యేక దృష్టి సారించారని ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈక్రమంలోనే పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు 'నాడు- నేడు' పథకం కింద పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నారన్నారు.

తల్లిదండ్రులూ శ్రద్ధ చూపాలి..

పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించాలంటే ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులూ శ్రద్ధ చూపాలని ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి సూచించారు. శుక్రవారం రాత్రి ఆయన బుక్కపట్నంలో 10వ తరగతి విద్యార్థులతో ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులతో మాట్లాడుతూ... ఒత్తిడికి గురికాకుండా ఇష్టంతో చదివాలన్నారు. విద్యార్థులను చదివించే విషయంలో ఉపాధ్యాయులతో పాటు వారి తల్లిదండ్రులూ బాధ్యత తీసుకోవాలన్నారు. 8వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ బైజూస్ కంటెంట్‌తో కూడిన విలువైన ట్యాబ్స్ ఇచ్చామని, ఇది మీకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరా నమోనమః







రొళ్ల: రత్నగిరిలో బ్రహ్మరథాన్ని లాగుతున్న భక్తులు, భక్తులకు అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు (ఇన్‌సెట్) రథంపై కొలువుదీరిన సుబ్రహ్మణ్యేశ్వరుడు

- కమనీయంగా సాగిన రథోత్సవం
- భారీ సంఖ్యలో పాల్గొన్న భక్త జనం

రొళ్ల: సుబ్రహ్మణ్యేశ్వరుడి నామస్మరణలో మండలంలోని రత్నగిరి మార్మోగింది. సుబ్రహ్మణ్యస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం బ్రహ్మ రథోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయాన్నే రథాన్ని అలకరించారు. వేద పండితులు రథం ముందు భాగాన శాంతి హోమ, దీక్ష హోమ, బలిప్రధాన పూజలు చేశారు. అనంతరం వల్లీప్రభ సమేత సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవమూర్తులను మేళతాళాలతో ఆలయం నుంచి రథం వద్దకు తీసుకువెచ్చి కొలువుదీర్చారు. అనంతరం దేవాలయ ప్రాంగణం నుంచి కోట వీధి వరకు రథాన్ని లాగారు. ఈ సందర్భంగా భక్తులు రథంపైకి అరటి పళ్లు, పూలు, బొరుగులు, తమలపాకు తదితర వాటిని నైవేద్యంగా విసిరి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవాన్ని తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల వారితో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో రత్నగిరి కిటకిటలాడింది. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు.

చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలి

- వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కలెక్టర్ బసంత్‌కుమార్



వ్యవసాయ డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్ తదితరులు

పుట్టపర్తి టౌన్: వాణిజ్య పంటలతో పాటు రైతులు చిరుధాన్యాలు సాగు చేసేలా ప్రోత్సహించాలని, ఈ మేరకు తగు సూచనలు, సలహాలివ్వాలని కలెక్టర్ బసంత్‌కుమార్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అవుటాల రమణారెడ్డి అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ...పంట నమోదు ప్రక్రియ పకడ్బందీగా సాగాలన్నారు. డీఆర్‌డీఏ, డ్వామా శాఖల ఆధ్వర్యంలో మునగతోటలను అభివృద్ధి చేసే కార్యక్రమం వేగవంతం చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, ఈ క్రమంలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న రైతుల ద్వారా మిగతా రైతులకు సూచనలు, సలహాలు ఇప్పించాలన్నారు. అలాగే వ్యవసాయ సలహా మండలి సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చిన అంశాలన్నీ పరిశీలించి పరిష్కరించాలని సూచించారు.

ఆర్బీకేల్లో అన్నీ అందుబాటులో ఉంచాలి..

జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రమణారెడ్డి మాట్లాడుతూ...రైతు భరోసా కేంద్రాల(ఆర్బీకే) ద్వారా రైతులకు మెరుగైన సేవలందించాలన్నారు. సీజన్ వారీగా ఆయా ప్రాంతాల్లో పండించే పంటలు, ఆశించే చీడపీడలు, తెగుళ్ల వాటి నివారణకు తీసుకోవాల్సిన పంటల యాజమాన్యంపై రైతులకు అధికారులు అవగాహన కల్పించాలన్నారు. మొక్కజొన్న పంటకు బీమా సౌకర్యం కల్పించాలన్నారు. వైఎస్సార్ పశుబీమాపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. నకిలీ విత్తనాలు, క్రిమి సంహారక మందులతో రైతులు నష్ట పోకుండా చూడాలన్నారు. అనంతరం రైతులు కోసం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వ్యవసాయ శాఖ డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, పశుసంవర్ధకశాఖ అధికారి సుబదాస్, ఉద్యాన వన శాఖ అధికారి చంద్రశేఖర్, సెరికల్చర్ ఏడీ పద్మావతి, మార్కెటింగ్ శాఖ అధికారి నరసింహామూర్తి, కదిరి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతుల అభ్యున్నతికి తోడ్పాటు



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్: రైతుల అభ్యున్నతికి తోడ్పాటునందించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుబ్బారావు పేర్కొన్నారు. శుక్రవారం పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లా గ్రామీణ వ్యవసాయ సహాయకుల సంక్షేమ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీఏఓ సుబ్బారావు, అగ్రిబోర్డు అడ్వయిజరీ కమిటీ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి విచ్చేసి ప్రసంగించారు. వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడమే ధ్యేయంగా ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ప్రతి రైతుకూ సంక్షేమ ఫలాలు దక్కేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఏ సమస్య వచ్చినా తక్షణం పరిష్కించేలా కృషి చేయాలన్నారు. అనంతరం గ్రామీణ వ్యవసాయ సహాయకుల సంక్షేమ సంఘం క్యాలెండర్లు ఆవిష్కరించారు. సంఘం సభ్యులంతా ఐక్యంగా ఉండి ఉద్యోగుల సంక్షేమానికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏలు సనావుల్లా, విద్యావతి, స్వయంప్రభ, కృష్ణమీనన్, , క్రిష్ణయ్య, సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సాయి కౌశిక్, జిల్లా అధ్యక్షుడు అంజిబాబు, జనరల్ సెక్రెటరీ త్రినాథ్, మహిళాధ్యక్షురాలు బృందావని, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం డీఏఓ సుబ్బారావును ఘనంగా సత్కరించారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

తాడిపత్రి అర్బన్: పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ధరణీబాబు తెలిపారు. శుక్రవారం స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద గంజాయిని విక్రయిస్తున్నారన్న సమాచారంతో సిబ్బందితో కలసి దాడులు చేశామని పేర్కొన్నారు. గంజాయి విక్రయిస్తున్న కటిక మహ్మద్ మంజూర్, నసారి కిరణ్‌ను అరెస్టు చేసి వారి వద్ద నుంచి గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

సందడిగా బాలోత్సవం

తామంతా కేవలం చదువులకే పరిమితం కాదు. ఏ రంగంలోనైనా తీసిపోమని ఆ విద్యార్థులు చాటిచెప్పారు. రంగస్థలంపై అడుగు పెడితే ఎవరైనా కేరింతలు కొట్టాల్సిందేనని నిరూపించారు. విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ప్రతి ఏటా నిర్వహించే బాలోత్సవంలో ఆడిపాడారు.



ఝాన్సీ లక్ష్మీబాయి వేషధారణలో బాలిక

- ఆటపాటలతో ఆహ్లాదకరంగా ప్రారంభం
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న బాలబాలికలు
- చదువుతో పాటు కళల్లోనూ చిన్నారులను ప్రోత్సహించాలన్న వక్తలు

అనంతపురం కల్చరల్: చిన్నారుల సృజనకు అద్దం పట్టేలా మూడురోజుల పాటు సందడిగా సాగనున్న బాలోత్సవం శుక్రవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఘనంగా ప్రారంభమైంది. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన బాలబాలికలు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల మధ్య ప్రతిభ చాటుకున్నారు.

ప్రతి వేదికపై జాలువారిన సృజన..

తొలిరోజు పిల్లల పండుగను దిశ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, బాలోత్సవ్ కమిటీ చైర్‌పర్సన్ షమీమ్ షఫీవుల్లా చిన్నారులతో కలిసి జాతీయ జెండాను, బాలోత్సవ్ పతాకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. బాలోత్సవం ప్రాంగణాన్ని జిల్లాకు చెందిన ప్రముఖుల పేర్లతో ఏర్పాటు చేసి వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. నృత్యకళానిలయం వ్యవస్థాపకులు సంధ్యామూర్తి శిష్యబృందం శ్రీధరి, వర్ణిక గణేష స్తుతిపై శాస్త్రీయనృత్యంతో, లాలిత్య బృందం వందేమాతరంతో బాలోత్సవ సందడికి శ్రీకారం పలికారు. అనంతరం వివిధ వేదికలపై వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, కర్రసాము, జానపద, శాస్త్రీయ నృత్యాలు, సైన్సు ఎగ్జిబిషన్, శాస్త్రీయ సంగీతం, బొమ్మలు చేయడం వంటి పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని సృజనను చాటుకున్నారు. ముఖ్యంగా చిన్నారుల దేశభక్తుల వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి.

బాల్యాన్ని చిదిమేయొద్దు..

ఎంతో అందమైన బాల్యాన్ని చిదిమేస్తున్నారని వారిని హాయిగా ఆటపాటల్లో గడపనివ్వాలని మార్కులు, ర్యాంకుల గోల వద్దని పలువురు సాహితీవేత్తలు తల్లిదండ్రులకు సూచించారు. జెండా ఆవిష్కరణ అనంతరం జరిగిన సమావేశానికి బాలోత్సవ కమిటీ చైర్మన్ షమీమ్ షఫీవుల్లా అధ్యక్షత వహించారు. డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులతో పాటు సీనియర్ నాట్యాచార్యులు సంధ్యామూర్తి, ఆర్ట్సకళాశాల ప్రిన్సిపాల్ దివాకరరెడ్డి, సాహితీవేత్తలు తరిమెల అమరనాథరెడ్డి, చెట్ల ఈరన్న, జిలాన్‌బాషా, నబీరసూల్, రియాజుద్దీన్, ఎల్కేపి అధ్యక్ష కార్యదర్శులు వెంకట సుబ్బయ్య, పద్మజ, పోతుల నాగరాజు, బాలోత్సవ్ ప్రతినిధులు ఐద్వా సావిత్రి, శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. భాష పట్ల మమకారం , కళల పట్ల అనురక్తి, క్రీడల, వైజ్ఞానిక విషయాల పట్ల ఆసక్తిని పెంచడానికి నిర్వహిస్తున్న బాలోత్సవం ప్రతి ఏటా జరుగుతుండటం ఆనందదాయకమన్నారు. సెల్‌ఫోన్లకు, కంప్యూటర్లకు పరిమితం అయిపోతున్న చిన్నారులు అందులో మంచిని గ్రహించి భవితను తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా చిన్నారులందరికీ సాయిట్రస్టు ప్రతినిధులు అన్ని వసతులు కల్పించారు. అలాగే సాయంత్రం సమావేశంలో పలువురు సాహితీవేత్తలు, అధికారులు ఆత్మీయ అతిథులుగా వివిధ పాఠశాలల చిన్నారులకు జ్ఞాపికలనందించారు. సీపీఎం జిల్లాకార్యదర్శి రాంభూపాల్, మధురశ్రీ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా ఆకాశవాణి సీనియర్ వ్యాఖ్యాత జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి, ఎల్ఆర్ వెంకటరమణ వ్యవహరించారు.

సృజనను ప్రోత్సహించాలి

బాలల్లో సహజంగా దాగుండే సృజనను గుర్తించి ప్రోత్సహించాలని ఇన్‌చార్జి డీఈఓ కృష్ణయ్య అన్నారు. బాలోత్సవానికి ఆయన శుక్రవారం సాయంత్రం ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఎప్పుడూ చదువుతో ఒత్తిడిలో ఉండే బాలబాలికలకు బాలోత్సవం ఆనందం, ఆహ్లాదాన్ని కలిస్తుందన్నారు. వేడుకలకు తమ వంతు సహకారాన్ని అందిస్తామని చెప్పారు. అనంతరం వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన చిన్నారులకు బహుమతులందించారు. డీఈఓ వెంట సూపరింటెండెంట్ ఆదినారాయణ, బాలోత్సవం ప్రతినిధులు జలీల్ తదితరులున్నారు.



వివిధ వేషధారణలతో ఆకట్టుకున్న బాలబాలికలు



సైన్సు ఎగ్జిబిషన్‌లో నమూనాలను ప్రదర్శిస్తున్న బాలికలు



చిన్నారులకు బహుమతులందిస్తున్న డీఈఓ కృష్ణయ్య

ఏటీఎంలో నగదు అపహరణకు విఫలయత్నం

సోమందేపల్లి: మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్ వద్దనున్న ఇండియన్ 1 ఏటీఎంలో నగదు అపహరణకు గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం విఫలయత్నం చేశారు. ఏటీఎం వెనుకభాగంలో ఉన్న షెట్టర్‌ను గ్యాస్ కట్టర్‌తో కత్తిరించారు. షట్టర్ రాకపోవడంతో దుండగులు పరారయ్యారు. పక్కనే ఉన్న ఓ ఇంటి తలుపులు ధ్వంసం చేయడానికి ప్రయత్నించి, టీ కొట్టులో ఉన్న వాటర్ బాటిళ్లు ఎత్తుకెళ్లారు. ఏటీఎం వద్ద సీసీ కెమెరాలు లేవు. సమీపంలో ఉన్న మరో హోటల్ వద్ద సీసీ కెమెరాలను పరిశీలించగా, ఆటోలో దుండగులు ఏటీఎం పరిసరాల్లో సంచిరించినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.



చోరీకి విఫలయత్నం చేసిన ఏటీఎం ఇదే

జమునతో 'అనంత' బంధం

అనంతపురం కల్చరల్: తెలుగు ప్రేక్షకుల హృదయాలలో చిరస్థాయిగా ముద్ర వేసుకున్న సినీనటి జమున మరణం పట్ల జిల్లా కళాకారులు తీవ్ర సంతాపాన్ని తెలిపారు. విలువలతో కూడిన వ్యక్తిత్వంతో ఎంతోమందికి ఆత్మీయురాలిగా మారిన జమునకు ఉమ్మడి అనంతపురం జిల్లాతో ప్రత్యేక అనుబంధం ఉంది. పుట్టపర్తి సత్యసాయిబాబాకు పరమ భక్తురాలు అయిన జమున ఆయన జన్మదినాల సమయాలలో తరచూ పుట్టపర్తికి వచ్చేవారు. జమునను అనంతపురం నగరానికి చెందిన సినీ అభిమాని వరం వేంకటేశ్వర్లు నేతృత్వంలో 'అనంత కళావాహిని సంస్థ' 2010లో ఘనంగా సత్కరించి కనకాభిషేకం చేశారు. స్థానిక లలితకళాపరిషత్తులో జరిగిన వేదికపై జమున ఇక్కడి వారితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కోనసీమ వరద బాధితుల సహాయార్థం ప్రముఖ సినీనటులతో కలిసి రాయలసీమ అంతటా పర్యటించిన అనుభవాలను పంచుకున్నారు. జమున మృతి పట్ల అనంత కళావాహిని ప్రతినిధులు వరం వేంకటేశ్వర్లు, రమేష్ నీల్, వరప్రసాద్ తదితరులు తమ సంతాపాన్ని ప్రకటించారు. జమున లాంటి అరుదైన నటీమణులు మళ్లీ రావడం అసాధ్యమని , ఆమె లేని లోటు పూడ్చలేనిదని విచారం వ్యక్తం చేశారు.



అనంతకు వచ్చిన సందర్భంలో జమునతో జిల్లా కళాకారులు (ఫైల్)

'దుర్గం'లో జమున కుటుంబీకులు

రాయదుర్గంటౌన్: తెలుగు చలన చిత్రసీమలో కథ నాయికగా ఎదిగిన నటి జమునకు రాయదుర్గంతో విడదీయరాని బంధం ఉంది. జమున తండ్రి నిప్పాణి శ్రీనివాసరావు సోదరుల కుటుంబాలు నేటికీ రాయదుర్గంలోని కోట వద్ద ఉన్నాయి. జమున పెద్దనాన్నలు నిప్పాణి రంగరావు, నిప్పాణి శివనారాయణమూర్తి కుటుంబాలు స్థానికంగానే నివాసం ఉన్నాయి. జమున ఇక లేరనే విషయాన్ని తెలుసుకున్న కుటుంబీకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సొంత మేనత్త జమున మృతి తీరని లోటని అల్లుడు సుధీర్ తెలిపాడు.

వైద్య, ఆరోగ్యశాఖలో పోస్టు భర్తీకి నోటిఫికేషన్

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయ పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టును కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేసేందుకు నోటిఫికేషన్‌ను జారీ చేసినట్లు జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి వీరబ్బాయి తెలిపారు. డిస్ట్రిక్ట్ కన్సల్టెంట్ ఫర్ క్వాలిటీ అసూరెన్స్ పోస్టును భర్తీ చేస్తున్నామని వివరించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఫిబ్రవరి 3వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు https:// ananthapuramu.ap. gov.in అనే వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ దరఖాస్తు, విద్యార్హత సర్టిఫికెట్లను జతచేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

క్యాష్ రివార్డుల పేరుతో మోసాలు

- సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దని ఎస్పీ ఫకీరప్ప విజ్ఞప్తి



అనంతపురం శ్రీకంఠంసర్కిల్: హాయ్...హాలో అంటూ ఫోన్ పే, గూగుల్ పే కంపెనీల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌తో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అనంతపురం జిల్లా ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి హెచ్చరించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఫోన్‌పే, గూగుల్ పేలో రివార్డ్ అమౌంట్ ఉందంటూ అగంతకులు చాలా మందికి ఫోన్ చేస్తున్నట్లు తెలిపారు. మీరు ఆ అమౌంట్‌ను వినియోగించుకోలేదని మాయ మాటలు చెబుతున్నారన్నారు. ఆ డబ్బు వినియోగించుకోకపోతే వెనక్కి వెళ్లిపోతుందంటూ మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి ఫోన్‌కాల్స్‌పై అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. మొదటగా ఫోన్ పే యాప్ ఓపెన్ చేయమంటారని, తర్వాత ఒక పే రిక్వెస్ట్‌కు సంబంధించిన నోటిఫికేషన్ కనిపిస్తుందన్నారు. వారి మాయ మాటలతో పే ఆప్షన్‌పై క్లిక్ చేసి పిన్ నంబర్ ఎంటర్ చేయగానే ఖాతా నుంచి డబ్బులు వారి అకౌంట్‌లోకి జమ అవుతాయన్నారు. సైబర్ నేరగాళ్లకి డబ్బుకట్ అయ్యాయని చెప్పినా.. మీరు ఈ కాల్ పూర్తిచేయగానే ఖాతాలో డబ్బు జమ అవుతుంది అని సమాధానమిస్తారన్నారు.

1930 నంబర్‌కు ఫిర్యాదు చేయండి

ఫోన్‌పే, గూగుల్‌పే తదితర వాటి పేరుతో క్యాష్ రివార్డులందరూ ఎవరైనా ఫోన్ చేస్తే నమ్మొద్దని ఎస్పీ ఫకీరప్ప ప్రజలకు సూచించారు. మీరు డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయడంతో వచ్చిన రివార్డును మీరు ఆ సంబంధిత పే రిక్వెస్ట్ లేదా రిసీవ్ రిక్వెస్ట్ చెక్ చేసుకోవాలని, తెలియని లింకులపై మాత్రం ఎలాంటి పరిస్థితుల్లో క్లిక్ చేయదన్నారు. ఫోన్‌పే, గూగుల్ పే కంపెనీ ప్రతినిధులు కస్టమర్లకు ఫోన్ చేయరన్న విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలని సూచించారు. ఎవరైనా ఈ విధంగా మోసపోతే 1930 నంబరుకు ఫిర్యాదు చేయాలని ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి విజ్ఞప్తి చేశారు.

పవన్.. పిచ్చిప్రేలాపనలు ఆపు

- రాయలసీమ విద్యావంతుల వేదిక కోఆర్డినేటర్ రాజశేఖరరెడ్డి

పెనుకొండ: జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పిచ్చి ప్రేలాపనలు ఆపాలని రాయలసీమ విద్యావంతుల వేదిక కోఆర్డినేటర్ రాజశేఖరరెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు. సీమ హక్కుల గురించి, విభజన చట్టంలోని హామీల గురించి కనీసం కేఆర్ఎంబీ కార్యాలయం ఏర్పాటు గురించి మాట్లాడని పవన్‌కళ్యాణ్ రాయలసీమ రాష్ట్ర ఉద్యమకారుల తోలు తీస్తాననడం ఆయన కుసంస్కారానికి , అహంకారానికి నిదర్శనంగా నిలుస్తోందన్నారు. పవన్‌కు పప్పూరు రామాచార్యులు తెలుసా? శ్రీబాగ్ ఒప్పందం గురించి తెలుసా? కనీసం ఈ విషయం విన్నావా అని ప్రశ్నించారు. నిత్యం అమరావతి జపం చేస్తున్నారే తప్పా రాష్ట్రంలో రాయలసీమ ఉందన్న విషయం పవన్‌కు తెలుసా అని రాజశేఖరరెడ్డి నిలదీశారు. కడప స్టీల్ ప్లాంట్, గుంతకల్ రైల్వేజోన్ గురించి కనీసం మాట్లాడావా? అని పవన్‌కళ్యాణ్‌ను ప్రశ్నించారు. అలాంటి విషయాలపై మాట్లాడని పవన్ కళ్యాణ్ ఉద్యమకారుల తోలు తీస్తానని చెప్పడానికి ఎంత ధైర్యమని విమర్శించారు. తెలంగాణా ఉద్యమ సమయంలో ఇలాంటి మాటలు మాట్లాడలేదని, అలా మాట్లాడితే తెలంగాణా ప్రజలు పవన్‌కళ్యాణ్ తోలు తీస్తారన్న భయంతో మాట్లాడలేదని పేర్కొన్నారు.

సిమెంట్ లారీని ఢీ కొన్న కంటైనర్



సహాయక చర్యల్లో పాల్గొన్న ఏఎస్ఐ మురళి

సోమందేపల్లి: మండలంలోని పాపిరెడ్డిపల్లి సమీపంలో బెంగళూరు వైపు వెళుతున్న సిమెంట్ లారీని అనంతపురం వైపు వెళ్ళే కంటైనర్ ఢీ కొన్న ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కంటైనర్ వాహనం అదుపుతప్పి బెంగళూరు వైపు వెళ్లే సిమెంట్ లారీను ఢీ కొనడంతో పాపిరెడ్డిపల్లి చెరువు మరువ వెళ్లే కాలువ (గుంత)లో దూసుకెళ్లింది. ఈ ఘటనలో తమిళనాడుకు చెందిన సిమెంట్ లారీ డ్రైవర్ సెంథిల్ మురుగస్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ మురళి సంఘటనా స్థలానికి చేరుకొని స్వయంగా లారీ క్యాబిన్ నుంచి క్షతగాత్రుడిని బయటకు తీసుకొచ్చారు. మురగస్‌ను వెంటనే పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం బెంగళూరు ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో చిక్కుకున్న గొర్రెలు



చెరువులో నీట మునిగిన గొర్రెలను బయటకు తీసుకొస్తున్న దృశ్యం

- 72 జీవాల ప్రాణాలు కాపాడిన అగ్నిమాపక సిబ్బంది
- ఆరు మృతి, 42 గొర్రెల ఆచూకీ గల్లంతు

మడకశిరరూరల్: మడకశిర చెరువులో శుక్రవారం నీరు తాగడానికి వెళ్లి ప్రమాదవశాత్తూ నీటి మునిగి కంప చెట్లల్లో ఇరుక్కుపోయిన గొర్రెలను అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. మొత్తం 120 గొర్రెలు చిక్కుకోగా 78 జీవాలను బయటకు తెచ్చారు. అందులో ఆరు గొర్రెలు చనిపోయారు. మిగతా 42 గొర్రెల ఆచూకీ గల్లంతైంది. వివరాల్లోకెళితే... మెళవాయి గ్రామానికి చెందిన గొర్రెల కాపర్లు పూజారి ప్రభాన, కమ్మరి శివప్ప పొలాల్లో మేత వేయించి మడకశిర చెరువులో నీటిని తాపించడానికి గొర్రెలను తోలుకెళ్లారు. చెరువులోని రోడ్డుపై నీరు ఉన్న కల్వర్ట్ వద్ద నీరు తాగుతుండగా ప్రమాదవశాత్తూ గొర్రెలు రోడ్డుపై నుంచి చెరువుకి పడిపోయి నీటిలోని కంపచెట్లుల్లో ఇరుక్కుపోయాయి. గమనించిన కాపర్లు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక అధికారి విజయకుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడికి చేరుకొని నీటి మునిగి కంపచెట్లుల్లో ఇరుక్కుపోయిన 78 గొర్రెలను ఒక్కొక్కటిగా బయటికి తీసుకొచ్చి పశువైద్య అధికారులతో పశువైద్య చికిత్సలు చేయించారు. అయితే ప్రమాదంలో 6 గొర్రెలు మృతి చెందాయని అగ్నిమాపక అధికారి తెలిపారు. 120 గొర్రెల్లో 78 గొర్రెలను అగ్నిమాపక అధికారులు బయటికి తీశారని మిగిలినవి నీటినిలో మునిగిపోయాయని గొర్రెల కాపర్లు తెలిపారు. మృతి చెందిన గొర్రెలను వీఆర్ఓ నరేష్, సర్పంచ్ రంగనాథ్ పరిశీలించి జరిగిన నష్టాన్ని కాపర్లను అడిగి తెలుసుకున్నారు. పశువైద్య అధికారులు మృతి చెందిన గొర్రెలకు శవపరీక్ష నిర్వహించారు. నష్టపోకుండా ఆదుకోవాలని కాపర్లు విజ్ఞప్తి చేశారు. అగ్నిమాపక సిబ్బంది సేవలను స్థానికులు అభినందించారు.